
# ఆసరా

3



కొన్ని అర్థంకాని విషయాలు ఎన్నటికీ అర్థం కాకుండానే మిగిలిపోతాయి.
అలా ఎందుకు జరుగుతుందో అర్థమే కాదు మరి!
ఆ పూట సీతారామయ్యగారు ఎప్పటిలా మార్నింగ్‌వాక్‌కు వెళుతూ బంటిని, వాడి నాయనమ్మని పట్టించుకోకపోతే అసలిదంతా జరిగేదే కాదు.
అసలిదంతా జరగడం కోసమే ఆయన వారిని పట్టించుకున్నారో లేదో కానీ - మొత్తానికి ఆయన స్వభావానికి విరుద్ధంగా మొట్టమొదటిసారి పక్కవారి వ్యవహారంలో తలదూర్చారు.
అదెలాగంటే -
సీతారామయ్యగారు ఇంటినుంచి బయలుదేరి, ఆనంద్‌నగర్ పోస్టాఫీసును చుట్టేసి తిన్నగా ఖైరతాబాదు సందువరకూ నడిచి, తిరిగి ఇంటికి వస్తూ ఉండగా - కాస్త గట్టిగా వినిపించిన అరుపులు ఆయనను ఆపాయి.
"ఆ ముదనష్టపు దాన్ని ఇంట్లోకి తెస్తావేరా? పొద్దున్నే దాని పాపిష్టిమొహం చూసే ఖర్మేంట్రా?" వీధి చివర బామ్మగారు వాపోతున్నారు.
"పో... నాయనమ్మా! ఇది ఇంత ముద్దుగా ఉంటే అలాగంటావ్! నా ఫ్రెండ్సందరికీ పెట్స్ ఉన్నాయి తెలుసా! రీతూ దగ్గర పామేరియన్ వుంది. రాకేష్‌గాడి దగ్గర టాకింగ్ ప్యారెట్ వుంది. ఇంకా రాజు దగ్గరమో లవ్‌బర్డ్స్..." - బంటి తన చేతిలోని చిన్ని పిల్లికూనను మురిపెంగా నిమురుతూ అంటున్నాడు.
"ఇంకోమాట మాట్లాడావంటేనా... మీ నాన్నని కేకేస్తా! వేలెడు లేవు వెధవా... బారెడు సమాధానం చెప్తావట్రా."
సీతారామయ్యగారు బంటివంక కుతూహలంగా చూశారు.
ఈ లోకంతో పనేలేనట్టు బంటి పిల్లికూనను పరిశీలించడంలో మునిగిపోయి వున్నాడు. ఊలులాంటి మెత్తటి జుట్టును మెల్లిగా నిమురుతూ దానిని తన ఎదకానించుకున్నాడు. అరమోడ్పు కనులతో రాగయుక్తంగా పాడసాగాడు.
"ఐ లవ్ మై లిటిల్ పుస్సీ
హర్ కోట్ ఈస్ సో వామ్...."
ఇక బంటిగాడి నాయనమ్మకు ఛిర్రెత్తుకొచ్చింది.
"వామూ లేదూ, జీలకర్రాలేదూ.... ముందా ముదనష్టాన్నెత్తుకెళ్ళి ఆ చెత్తకుప్ప దగ్గర పడేస్తావా? లేకపోతే అట్లకాడ తిరిగేసి ఆ పళాన నాలుగు వాయించమంటావా? వెధవన్నర వెధవా" -

నాయనమ్మ ఉగ్రరూపం చూసి బంటికి నిజంగానే భయమేసింది. ఇక తనకూ ఆ చిన్ని పిల్లకూనకు రుణం తీరిపోయినట్టేననుకున్నాడు.

బంటి ఉత్సాహం చల్లారిపోయింది.

బామ్మ అదే ఆవేశంలో కోడలిని పిలుచుకు రావడానికి ఇంట్లోకి విసావిసా వెళ్ళిపోయింది.

బంటి బిక్కమొహం వేశాడు. ఏడుపు ఒక్కటే తక్కువ.

పిల్లికూనను విడవలేక బోలెడంత దుఃఖం కమ్మేస్తుంటే ఏడుపు బిగబట్టి నిల్చున్నాడు.

అప్పటివరకూ మౌనంగా బంటిని గమనిస్తోన్న సీతారామయ్యగారు సరిగ్గా అప్పుడే బంటిని పలకరించారు.

"ఏం బాబూ..... నీకు పిల్లికూన నచ్చిందా?"

సీతారామయ్యగారికి పిల్లలతో తను సరిగ్గా మాట్లాడగలనన్న నమ్మకం లేదు. ఆయనకు మనుమలతో, మనుమరాళ్ళతో గడిపే అవకాశం లేదు మరి. వాళ్ళంతా భూగోళానికి ఆవలివైపున. ఆ పిల్లలందరి పేర్ల గురించో, వయస్సుల గురించో అడిగితే సీతారామయ్యగారు ఇబ్బందిలో పడిపోతారు.

బంటితో స్నేహం చేసుకోగలనన్న నమ్మకం లేకపోయినా ఆయన తన ప్రయత్నంలో వెనుకాడలేదు. మెల్లిగా మెత్తగా అడిగిన ప్రశ్నకు బంటి చివ్వున తలతిప్పి చూశాడు. తనవైపే నవ్వుతూ చూస్తోన్న సీతారామయ్యగారిని చూసి భారంగా తలూపాడు నచ్చిందన్నట్లుగా.

అప్పటిదాకా బిగబట్టిన ఏడుపు తన్నుకొచ్చింది. బంటి కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి.

"మీ అమ్మతో, నాన్నతో చెప్పు ఏమంటారో."

"మా అమ్మకి అసలే ఇష్టం లేదు. నాన్న పప్పీని కొంటానన్నపుడే ఖచ్చితంగా చెప్పేసింది - మనుషులకే చేయలేక చస్తుంటే మధ్యలో ఇదోటి ఎందుకు అంది. నేను, నాన్న సాయం చేస్తామన్నా ఒప్పుకోలేదు."

"సరే... మీ నాన్నతో నన్ను మాట్లాడమంటావా?"

"అమ్మో... వద్దొద్దు. నిజానికి ఆయనకూ పెట్స్ అంటే ఇష్టం లేదు. ఆయన పూలమొక్కల్ని పాడు చేస్తాయంటారు."

"అయితే... ఏం చేయాలి మరి" సీతారామయ్య ఆలోచిస్తున్నట్లు కనుబొమలు ముడిచారు.

బంటి కుతూహలంగా అతని ముఖంలోకి చూశాడు.

"ఓ పని చేస్తే....."

బంటి కళ్ళు విప్పార్చి ఆసక్తిగా ఆయన ముఖంలోకి చేశాడు.

"మా యింట్లో పెట్టుకుంటాను. రోజు వచ్చి ఆడుకుందువు....."

బంటి అనుమానంగా కళ్ళు చిట్లించాడు. ఏదో సందేహం వెలిబుచ్చబోయాడు.

"ఇంకా అక్కడే తగలడ్డావట్రా... అంట్ల వెధవ" బొమ్మగారు వీరావేశంగా, కోడలి సమేతంగా వీధి గుమ్మంలోకి వచ్చేస్తోంది. "బంటీ.. లోపలికి రా...." కోడలి కంఠం అక్కడి నుంచే

ఆజ్ఞాపించింది.

"వస్తున్నా మమ్మీ..."

బంటి మరో ఆలోచన లేకుండా పిల్లికూనను సీతారామయ్యగారి చేతిలో పెట్టేసి వెనక్కి తిరిగిచూడకుండా ఇంట్లోకి పరిగెత్తాడు.

సీతారామయ్యగారిలో ఏదో ఆనందం ఏదో ఉత్సాహం నిండిపోయింది. పిల్లికూనను పొదివి పట్టుకుని నింపాదిగా ఇంటికి నడిచాడు.

సీతారామయ్యగారు వ్యవసాయశాఖలో డైరక్టర్‌గా రిటైరయ్యారు. పిల్లలు ముగ్గురూ అమెరికాలో మూడుచోట్ల స్థిరపడ్డారు. ఇద్దరు అబ్బాయిలు. ఏనాడూ దిగులు లేదు. రిటైరవ్వగానే తండ్రిని, తల్లిని అక్కడికి వచ్చేయవలసిందిగా ముగ్గురూ విడివిడిగానూ. కుటుంబ సమేతంగానూ అనేకసార్లు చెప్పి చూసారు.

సీతారామయ్యగారికెందుకో శాశ్వతంగా అక్కడికి వెళ్ళడం అన్నది నచ్చలేదు. ఉద్యోగం చేస్తున్నపుడు చేయాలనుకునీ చేయలేని అనేక పనులను చేయడానికి ఇదే సరియైన సమయం అని ఆయన భావించారు.

నగర శివార్లలో ద్రాక్షతోట పెంపకం మొదలెట్టారు. రకరకాల ప్రయోగాలు మిత్రులతో సమావేశాలు ఆయనకు సంతోషంగా వుంది.

ఎటొచ్చి ఆయన శ్రీమతిగారే పిల్లల మీద దిగులుతో మంచం ఎక్కారు.

సీతారామయ్యగారు తన పిల్లల పని వత్తిడి తెలియని వ్యక్తేం కాదు. ఆయన వారి మీద ఎలాంటి ఆరోపణలూ లేవు. ఆమె మాత్రం పిల్లలనీ, వారి పిల్లలనీ తలుచుకుంటూ తలుచుకుంటూ కుమిలిపోతూ కుమిలిపోతూ కన్నుమూసింది.

తల్లి కాలంలో కలసిపోయాకైనా తండ్రి తమతో వస్తాడని పిల్లలు ఆశించారు. బతిమిలాడారు. ప్రాధేయపడ్డారు.

సీతారామయ్యగారు ఆర్నెల్లకో, ఏడాదికోమారు వచ్చిపోతాను కానీ శాశ్వతంగా రాలేనని చెప్పేసారు.

తండ్రి ఒంటరిగా ఎలా ఉంటాడో అని దిగులు పడుతూనే రంగన్నకు అతని బాగోగులు అప్పజెప్పి వారంతా ప్రయాణమైపోయారు.

సీతారామయ్యగారు వాళ్ళతో వెళ్ళని లోటేమిటో త్వరలో తెలుసుకున్నాడు. వాళ్ళ దగ్గరకు వెళ్ళలేకపోయాడు. భార్యలేని ఒంటరి జీవితంలో అనుక్షణం పిల్లల జ్ఞాపకాలు తోడవుతున్నాయి. సాయంత్రం వచ్చి కలిసే తన మిత్రులందరికీ పంచుకోవడానికి బోలెడు కబుర్లుంటాయి. కోడళ్ళ గడుసుతనం మీద ఫిర్యాదులు, కొడుకుల మెతకతనం, కూతుళ్ళ సౌజన్యం, అల్లుళ్ళ నిర్వాకం, మనవల ఘనకార్యాలు, మనవరాళ్ళ చిలిపిపనులు బోలెడు కబుర్లుంటాయి. సీతారామయ్యగారు కేవలం శ్రోతగా మిగిలిపోయే సందర్భాలే ఎక్కువ.

బహుశా సాయంకాలం కబుర్లే ఆయనకు మరింత వంటరివాణ్ణి చేస్తున్నట్లున్నాయి.

వాళ్ళ కోడళ్ళ గురించి ప్రస్తావించినపుడు తన కోడళ్ళు గుర్తొస్తారు.
కొడుకుల మెతకతనం గురించి ప్రస్తావించినపుడు తన కొడుకులు గుర్తొస్తారు.
మనవల మనవరాళ్ళ ఆటలపాటలు లేని శూన్యత గుర్తొస్తోంది. అది మెల్లమెల్లగా సీతారామయ్యగారి అచంచలమైన నిర్ణయాన్ని కుదిపిస్తోంది.
అలాంటపుడే ఆయనలో మరో ఆలోచనలు వస్తున్నాయి.
పెద్దకొడుకు ఇంటికి వెళితే సమస్యే లేదు. ఫ్లోరిడాలో వుంటున్నాడు. చక్కగా నారింజతోటను పెంచుకోవచ్చు.
రెండో కొడుకు మెంఫిస్‌లో. ప్రత్తిపంటలో ప్రయోగాలు చేయొచ్చు.
లేదూ కూతురి దగ్గరకు కాలిఫోర్నియా వెళితే కావలసినన్ని కాయగూరలు పండించుకోవచ్చు.
కానీ.. తన ద్రాక్షతోట!
దాన్నేం చేయాలి? ఎవరు చూసుకుంటారు!
తను లేకపోతే అది నిర్లక్ష్యం అయిపోదూ–
ఎండి బీడైపోదూ – వద్దొద్దు
చేజేతులా పెంచుకున్న పచ్చని తోటను తన నరాల్లో సత్తువ వున్నంతవరకూ వదలడు.
ఆ తరువాత కూడా – అక్కడే చిన్న కుటీరం వేసుకుని వుంటాడు. పర్ణశాల – వాన ప్రస్థాశ్రమం.
సీతారామయ్యగారి ఆలోచనలు విన్న ఆయన మిత్రులు భళ్ళున నవ్వేసారు.
"ఎవరండీ పోయి ఆ అడవుల్లో వుండేది. ఇంట్లో వున్నా హాయిగా ఏ టి.వి. చూస్తోనో గడపొచ్చు. మనవళ్ళకి పాఠాలు చెపుతూ గడిపేయొచ్చు."
"మీరసలే షుగర్ పేషెంట్. బ్లడ్ ప్రెషర్ కూడా వచ్చింది కదా. రోజూ డాక్టరుతో చెక్ చేయించుకోవద్దూ. అసలే వయసు మీద పడుతుందాయే, ఏ పూట ఎలా తెల్లవారుతుందో ఎవరం చెప్పగలం... "మరో మిత్రుడు అర్ధవంతంగా అన్నాడు.
"మనిషికి మనిషి తోడు. చెట్టూ పుట్టా కాదు. పిచ్చి ఆలోచనలు చేశావంటే కాళ్ళు చేతులూ కట్టేసి మీపిల్లలకు పార్శిల్ చేసి పారేస్తానంతే" – ఇంకో మిత్రుడు చనువుగా అన్నాడు.
అయినా ఒంటరితనం ఒంటరితనమే.
ఇంతమంది మిత్రులు, రంగన్న, ద్రాక్షతోట ఉన్నా తీరదు.
శ్రీమతి ఉన్నపుడు తన దినచర్య ఇదే. కానీ అప్పుడు ఒంటరితనం లేదు.
శ్రీమతి లేని లోటు. మాటపంచుకొనే మనిషి లేని లోటు. మనసు పంచుకునే మనిషి లేని లోటు.
ఆ లోటు భర్తీ చేయగల మనుషులు దూరాల తీరాల్లో.
సీతారామయ్యగారు ఆర్నెల్లకోసారి వస్తానని కొడుకులతో చెప్పినా రెండేళ్ళకోమారు కూడా వెళ్ళడం ఇష్టపడడం లేదు. వయసు మీరాక ప్రయాణం భారమైపోయింది.
'మేమంతా వచ్చి ఓ నాలుగురోజులున్నా నిన్ను ఒక్కణ్ణి చూడడం కోసం నాలుగురోజులు

వచ్చాం. పోయాం అనుకోవడం కన్నా నువ్వు వచ్చేస్తే సరిపోతుంది కదా' అన్నది పిల్లల వాదన.

ప్రస్తుతం మూడేళ్ళయింది విమానం ఎక్కి

స్తబ్దత... ఏకాంతం... సీతారామయ్యగారి ఇంటిని కబళించి వేసాయి. సరిగ్గా అప్పుడే సీతారామయ్యగారు పిల్లికూనను తన ఇంటిలోకి తీసుకొచ్చారు.

ఆ క్షణంలో ఆయనకు అదే ఆసరా అవుతుందని ఆయన ఊహించలేదు. రంగన్న కూడా.

పిల్లికూన మెల్లిమెల్లిగా బలం పుంజుకుంటోంది.

దాని లేతగోధుమరంగువంటి మీద నిండు గోధుమ రంగు గీతలు ఎవరో చిత్రకారుడు తీర్చిదిద్దినంత చక్కగా వున్నాయి.

మెత్తని ఊలు లాంటి జుట్టు మరింత నునుపెక్కుతోంది.

దానికోసం బంటి రోజూ సీతారామయ్యగారి ఇంటికి వచ్చిపోతున్నాడు.

క్రికెట్ బ్యాట్ పట్టుకుని ధీరోదాత్తంగా ఇంటి నుంచి బయలుదేరి గ్రౌండ్‌కి వెళ్ళకుండా పోస్టాఫీసు ప్రహరి చాటున నక్కి సీతారామయ్యగారి ఇంటిని చేరుకుంటున్నాడు.

ఇక సీతారామయ్యగారు పిల్లికూనతో పాటలు గెంతులు.

రంగన్నకూ బంటి వాళ్ళ బామ్మలాగే ఆ పిల్లికూనను చూస్తే వళ్ళు మంట. దాని 'ముదనష్టపు ముఖం చూడాల్సిరావడం' ఒక కారణమైతే కాచి వుంచిన పాలను, తోడేసిన పెరుగును, చిలికి ఉంచిన మజ్జిగను గుట్టుచప్పుడు చేయకుండా గుటకాయస్వాహా చేయడం మరో కారణం.

పిల్లికూనను వ్యాహ్యాళికి తీసుకెళ్ళాల్సిరావడం మరొక కారణం.

బొచ్చుకుక్కలు, జూలు కుక్కలు తీసుకొచ్చే పొరుగిళ్ళ వాళ్ళంతా తనను విచిత్రంగా చూడడం రంగన్నకు తలకొట్టేసినట్లుగా వుంది.

సీతారామయ్యగారు పిల్లికూనను బంటి కోరినట్లు సౌకర్యాలన్నీ అమర్చి పెట్టారు. రోజూ సోపుస్నానాలు. మెట్లగదిలో చిన్నపడక.

బుజ్జిముండ.

ఎంతో ముద్దొస్తోంది.

బంటి తనకు నేర్పినట్లుగా పిల్లికూన బంటి అడుగుల చప్పుడు వినగానే పరిగెత్తుకొస్తోంది. వళ్ళో కూర్చోని గారాలుపోతుంది. రోజూ బంటి చేతుల మీదగానో, సీతారామయ్యగారి చేతుల మీదగానో పాలు తాగుతుంది.

సీతారామయ్యగారికి మిత్రులతో పంచుకోవడానికి బోలెడు కబుర్లు దొరుకుతున్నాయి.

బంటి బడి నుంచి మోసుకొచ్చే కబుర్లన్నిటినీ ఆయన ఉల్లాసంగా మిత్రులతో పంచుకొంటున్నారు.

బంటితో దాగుడుమూతలు, బంటితో కబుర్లు కాలక్షేపాలు.

చివరికి బంటి బడికి అతని పెంపుడు జంతువును తీసికెళ్ళే రోజు వచ్చింది.

బంటి సీతారామయ్యగారు ఆలోచించి అలంకరణలు చేసారు. ఆ పిల్లికూన మెడలో ఎర్రటి

శాటిన్ రిబ్బన్ ముడేసి, చిన్ని ఇత్తడిగంటను కట్టారు.

పిల్లికూన తలాడించినప్పుడల్లా ఇత్తడిగంట మిలమిలా మెరుస్తోంది. దాని కళ్ళల్లో మెరుపులకు ధీటుగా.

బంటి సంతోషం చెప్పనలవి కాదు.

సీతారామయ్యగారు సరేసరి.

ఆ రోజున బడిలో మిత్రుల అందరికన్నా బంటి పిల్లికూన ఎక్కువ అభిమానాన్ని సంపాదించుకుంది.

బంటి పట్టలేని సంతోషంతో సీతారామయ్యగారిని వాటేసుకొని ముద్దాడాడు.

సీతారామయ్యగారిని పట్టి పీడిస్తోన్న ఏకాంతం పటాపంచలైంది. దిగులు విచారం చిరునామా లేకుండా మాయమయ్యాయి.

అయితే సీతారామయ్యగారి గారాబంతో పిల్లికూన మరీ అల్లరిగా తయారౌతుందని రంగన్న భావించసాగాడు. అతను ఈ విషయాన్ని సీతారామయ్యగారి మిత్రులతో చెప్పాలని చూశాడు. వాళ్ళు అతని మాటను తల దూర్చుకోలేదు.

“ఎంత సోకు చేసినా పిల్లి పిల్లే. దాని పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకలతో పోవాల్సిందే. ఏవిటో ఆయన పసిపిల్లవాడైపోయాడు.”

సీతారామయ్యగారిలో ఇప్పుడు మునపటికన్నా ఉత్సాహం నిండుకుంది. ఆరోగ్యం పుంజుకుందని ఆయన భావించారు.

ఓ రోజు సీతారామయ్యగారు ద్రాక్షతోటకు వెళ్ళినపుడు రంగన్న ఆ పిల్లికూనను ఒడుపుగా పట్టుకొని – మెడకు బెల్టువేసి మెట్ల కింద గదికి పరిమితం చేశాడు.

ఆ పూట సాయంత్రం ద్రాక్షతోట నుంచి వచ్చాక ఎప్పటిలా తన ఇన్సులిన్ ఇంజెక్షన్ వేసుకోబోయిన సీతారామయ్యగారు పిల్లికూన జ్ఞాపకం వచ్చి దానికి పాలు పోయడానికి వెళ్ళారు.

చిన్నగిన్నెలో రంగన్న తెచ్చిన పాలను పిల్లికూన ముందున్న గిన్నెలో పోస్తూ – “దాని మెడలో బెల్టు తీసే....” అంటూనే గుండెను పట్టుకొని పక్కకు ఒరిగిపడిపోయాడు.

ఆయన చేతిలోని సిరంజి కాటన్ అటూ, ఇటూ పడ్డాయి.

రంగన్న గాబరాగా సీతారామయ్యగారి మిత్రులందరికీ ఫోన్ చేశాడు.

వెంటనే సీతారామయ్యగారు నగరంలోని ఓ పెద్ద గుండె నిపుణిడి ఆధ్వర్యంలోకి వెళ్ళిపోయారు.

సీతారామయ్యగారు మాటా పలుకులేకుండా ఇంటెన్సివ్ కేర్ యూనిట్ మంచంపై ఉండిపోయాడు.

బతకడానికి ఆయన పోరాటం, బతికించడానికి డాక్టర్లు పోరాటం.

కొడుకులు అక్కడనుంచి ఫోన్లు చేసి నగరంలో వున్న తమ మిత్రులందరినీ తండ్రి దగ్గరకు తరలించారు.

ఒకటి.... రెండు.... మూడు.... నాలుగురోజులు.

సీతారామయ్యగారి పరిస్థితి రోజురోజుకీ అధ్వాన్నమౌతుంది.

సీతారామయ్యగారి ఆప్త మిత్రుల దగ్గర డాక్టరు పెదవి విరిచాడు.

“లాభం లేదు. పిల్లల్ని పిలిపించండి. ఇంక కొన్ని గంటలే.”

వెంటిలేటర్ మీద కృత్రిమ శ్వాస అందించారు.

ఐదు.... ఆరు.... ఏడు....

కొడుకులు వచ్చారు. కూతురు వచ్చింది.

తాము డాక్టర్లమని మర్చిపోయి భోరున ఏడ్చారు.

బంటి వాళ్ళ అమ్మనాన్నతో వచ్చాడు. చిన్నపిల్లవాడిని ఐ.సి.యు లోనికి రానివ్వలేదు. బిక్కమొహం వేసుకుని ఇంటికెళ్ళిపోయాడు.

చివరికి ఆ రోజు రాత్రి సీతారామయ్యగారి చుట్టూ కొడుకులు, కోడళ్ళు, కూతురు, అల్లుడు, మనుమలు, మనవరాళ్ళతో చేరి వుండగా కాలంలో కలిసిపోయాడు.

రంగన్న గొల్లుమన్నాడు.

అసలు ఇంతకాలం ఆయనలో ఊపిరి ఎలా నిలిచివుందో ఎవరికీ అర్థం కాలేదు.

“అదే చూడండి రక్తసంబంధం అంటే. అందర్నీ రప్పించుకుని వెళ్ళిపోయాడు. మహానుభావుడు.”

ఎలక్ట్రిక్ క్రిమేషన్‌లో తండ్రి అంత్యక్రియలు జరిపించి పిల్లలంతా ప్రయాణానికి సిద్దపడ్డారు మూడోరోజు.

రంగన్న తాను ఒంటరి వాడినని ఆ క్షణంలో గుర్తించాడు. తనింక ఆ ఇంట్లో ఎవరికోసం ఉండాలి? ఏం చేయాలి.

తనెప్పుడూ ఎక్కడికెళ్ళాలో, ఏం చేయాలో ఆలోచించుకోలేదే.

ఇపుడెలా –

సీతారామయ్యగారు హైదారాబాదు నుంచి తను వాళ్ళింట్లోనో వుంటున్నాడు. వాళ్ళే తన చుట్టాలు, పక్కాలు. ఇప్పుడెక్కడికి వెళ్ళాలి? ఏం చేయాలి.

సీతారామయ్యగారి పిల్లలు అతనికి ఆ యిల్లు అమ్మకం కుదిరేవరకూ అక్కడే ఉండమన్నారు. ద్రాక్షతోట బేరానికి పెట్టారు.

రంగన్న సీతారామయ్యగారిని తలచుకొని తలచుకొని ఏడ్చాడు. ఇల్లంతా బావురుమంటోంది.

చాన్నాళ్ళ తర్వాత బంటి పిల్లిలా భయంభయంగా రంగన్న దగ్గరికి వచ్చాడు.

సీతారామయ్యగారు హాస్పిటల్‌లో చేరినప్పటి నుండి బంటి ఆ పక్కకు రావడం లేదు. బంటి ఆనందమంతా హరించుకుపోయినట్లు ఉంది.

కార్టూన్ ఛానెల్‌లు, కామిక్స్ రుచించడం లేదు. బళ్ళో పాఠాలు బుర్రకెక్కడం లేదు. హోంవర్కులో తప్పులకి మమ్మీతో తన్నులు, టీచర్‌తో పనిష్మెంట్లు. బంటి మౌనం ఎవరికీ అంతుపట్టడం లేదు.

బంటి సీతారామయ్యగారి హాల్లో గోడకు తగిలించిన సీతారామయ్యగారి ఫోటోను చూసి బిక్కమొహం వేసాడు.

రోజూ బడిలో జరిగిన విశేషాలను కబుర్లుగా చెప్పకోవడానికి ఇప్పుడు తాతయ్య ఏడి?

బంటి రంగన్నను పలకరించడానికి ధైర్యం చాలక అలానే నిలబడిపోయాడు.

బంటి గుమ్మంలోని రంగన్నను, గోడమీది సీతారామయ్యగారిని మార్చి మార్చి చూస్తున్నాడు.

సీతారామయ్యగారి ముఖంలోని నవ్వుకీ రంగన్న ముఖంలోని దుఃఖానికి పొంతనే లేదు.

బంటి గిరుక్కున వెనక్కి తిరిగాడు.

రంగన్న లోకంలో పడ్డాడు.

"బంటీ బాబూ... వచ్చావా? ఇంక ఏదయ్య మీ తాతయ్య? లేడు... మనల్ని అందరిని ఏడిపించి ఆయన ఎలా నవ్వుతున్నాడో చూడు..." రంగన్న బావురుమన్నాడు. "ఆ పిల్లలమీది తాపత్రయంతో వారం రోజులు చావుతో పోరాడాడు. ఏం లాభం? వాళ్ళు వచ్చీరాగానే."

బంటి బిత్తరపోయాడు.

రంగన్న తనే తేరుకుని కళ్ళు తుడుచుకుంటూ బంటి దగ్గరకు వచ్చాడు.

ఇద్దరూ మానుల్లా నిల్చుండిపోయారు.

బంటికి ఇలాంటి భయంకర నిశ్శబ్దం అనుభవంలోకి రాలేదు ఎన్నడూ.

వాడి గుండెంతా డొల్ల అయిపోయింది. తలెత్తి రంగన్న వైపు చూసాడు.

రంగన్న బంటి ముఖంలోకి చూసి తేరుకున్నాడు. ఇద్దరి కళ్ళు కలుసుకున్నాయి.

సరిగ్గా అప్పుడే ఇద్దరికీ గుర్తొచ్చింది పిల్లికూన. ఏదీ? ఏమయిందీ?

రంగన్న గబగబ మెట్లగది వైపు పరిగెత్తాడు.

బంటికి విషయమేమిటో తెలియకపోయినా రంగన్నను అనుసరించాడు.

మెట్లకింది గదిలో పిల్లికూన అలానే వుంది.

ఊలు బంతిలా వుండే పిల్లికూన, ఎముకల గూడులా అయిపోయింది.

ఒకటా... రెండా... పదిహేను రోజుల పై మాటే.

తిండీ తిప్పలు లేకుండా... అసలు ఎలా బతికి ఉంది?

ఇన్ని రోజులు గది మూసేసి వుంచడంతో దాని మలమూత్రాల వాసన గుప్పుతుంది.

బంటి కడుపులో తెమిలినట్లయింది. గబుక్కున వెనక్కి అడుగు వేశాడు.

పిల్లికూన వెలుతురు చూసి ఒక్కసారి వెనక్కు తగ్గింది.

ఇప్పటివరకూ వెంటిలేటర్‌లోంచి వస్తోన్న వెలుతురుకు మాత్రం అలవాటుపడ్డ కళ్ళు ఒక్కసారిగా చెదిరినట్లయ్యాయి.

యజమాని లేనిలోటు దాని ముఖంలో స్పష్టంగా కన్పిస్తోంది.

రంగన్న బంటిని పిల్లికూనను చూస్తుండమని వంటింట్లోకి గబగబ వెళ్ళాడు.

బంటికి విచిత్రంగా దాని దగ్గరకు వెళ్ళాలనిపించలేదు. గుమ్మంలో నిలబడిపోయాడు.

రంగన్న వెళ్ళినంత వేగంగా, గిన్నెలో పాలు తీసుకుని వచ్చాడు.

బంటి మోకాళ్ళు మీద కూర్చుని కొత్తదానిని చూస్తున్నట్లు పిల్లికూన వంక చూస్తుండిపోయాడు.

రంగన్న తనలో తాను గొణుక్కుంటూ సీతారామయ్యగారిని తలచుకుంటూ పిల్లికూన మెడకు కట్టిన బెల్టును తీసాడు. దాని ఎదురుగా పాలగిన్నె పెట్టాడు.

పిల్లికూన రంగన్నను కానీ, బంటీని కానీ పట్టించుకోలేదు. దాని చూపు ఓ చోట చిక్కుకుపోయి వుంది.

సీతారామయ్యగారు చివరిసారిగా పోసిన పాలు అరిగిపోయినప్పటినుంచి దాని చూపు ఆ చోటే చిక్కుకుపోయి వుంది.

రంగన్ననికానీ, బంటీని కానీ పిల్లికూన పట్టించుకోలేదు. రంగన్న తెచ్చిన పాలను అసలే పట్టించుకోలేదు.

రంగన్న మెడకు వేసిన బంధాన్ని తప్పించగానే వంట్లో వున్న శక్తినంతా కాళ్ళలోకి తెచ్చుకుని ఒక్కసారిగా ఆ పక్కకు దూకింది.

రంగన్న, బంటీ దాని వేగానికి బిత్తరపోయి వెనక్కి తగ్గారు.

వారికి పిల్లికూన ప్రవర్తన అయోమయంగా తోచింది. అది ఎందుకలా దూది మీదకు దూకిందో వారికి అర్థం కాలేదు.

ఆ దూది ఆరోజు సీతారామయ్యగారు ఇంజెక్షన్ వేసుకోను తెచ్చుకున్నది. అప్పటినుంచీ అదలాగే పడి వుంది. ఆ పక్కనే సిరెంజ్.

దూది మీదకు దూకిన పిల్లికూన దాన్ని ఆబగా వాసన చూసింది. ఆశగా నోట కరుచుకుంది. పిల్లి ఆత్రానికి దూది నోటి నుండి జారి కిందపడింది. పిల్లి ఆవురావురంటూ గోళ్ళతో గీకుతోంది. పళ్ళతో పీకుతోంది. గుర్రుమంటోంది. రొప్పుతోంది. రోజుతోంది.

రంగన్నకు పిల్లికూన ప్రయత్నం కొద్దిగా బోధపడింది.

"ఇన్నాళ్ళూ ఆ దూదిని ఏదైనా ఆహారపదార్థం అనుకుందో ఏమో!"

రంగన్న పాలగిన్నెను ముందుముందుకు జరుపుతూ బోలెడెంత జాలితో దానిని సీతారామయ్యగారు పిలిచినట్లే పిలిచాడు.

పిల్లికూన లోకంలో మరేది పట్టించుకోవడం లేదు.

పిల్లికూన గీకుతూ, తలతో నేలను మోటిస్తూ.... మోటిస్తూ... హఠాత్తుగా కిందకు విరుచుకుపడిపోయింది. నిశ్చలనంగా.

రంగన్నకు ఏమీ అర్థం కాలేదు.

బంటీకి అసలే అర్థం కాలేదు.

యజమాని మీద ప్రేమతో పిల్లికూన ప్రాణం వదిలిందని ఆ కాలనీలో అందరూ ఆగబ్బుగా చెప్పుకున్నారు. నిజానికి ఎందుకలా జరిగిందో వారికీ అర్థం కాలేదు.

కొన్ని అర్థం కాని విషయాలు అర్థం కాకుండానే మిగిలిపోతాయి.